జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 28-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 261 పేజీలు: 4 వెల : రూ.7

# పోలింగ్‌లో.. ఫస్ట్

* ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు * ఉత్తరాంధ్రలో 92.40 శాతం నమోదు * విశాఖ జిల్లాలో 87.34 శాతం * శ్రీకాకుళం జిల్లాలో 94.72 శాతం * పార్వతీపురం మన్యంలో 93.74 శాతం *విజయనగరంలో 94.05 శాతం *ఓట్లు వేసేందుకు బారులు దీరిన ఉపాధ్యాయులు * పోలింగ్ ప్రక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి27(వార్త):** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో శ్రీకాకుళం జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. ఉదయం నుంచే అన్ని పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార యంత్రాంగం అన్ని కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల్లో 22,493 మంది ఓటర్లు ఉండగా 20,783 మంది ఓటేశారు. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 92.40 శాతం పోలింగ్ నమోద య్యింది. విశాఖపట్టణం జిల్లాలోని 13 పోలింగ్ కేంద్రాల పరిధిలో 5,529 ఓటర్లు ఉండగా సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 4,829 మంది వారి హక్కును వినియోగించుకున్నారు. 87.34 శాతం పోలింగ్ నమోదైంది. విజయనగరం జిల్లాలో 5,223 మంది ఓటర్లు ఉండగా 4,912 మంది ఓటేశారు. 94.05 శాతం పోలింగ్ నమోదయ్యింది. పార్వతీపురం జిల్లాలో 93.74 శాతం పోలింగ్ నమోదవ్వగా 2,333 ఓటర్లకు గాను 2,187 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనకాపల్లి జిల్లాలో మొత్తం 2,885 ఓట్లు ఉండగా 2,776 పోలయ్యాయి. 96.22 శాతం పోలింగ్ జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,488 మందికి గాను 1,310 మంది వారి హక్కును వినియోగించుకున్నారు. 88.04 శాతం పోలింగ్ నమోదైంది. శ్రీకాకుళం జిల్లాలో 5,035 మంది ఓటర్లు ఉండగా 4,769 మంది ఓటేయ్యగా 94.72 శాతం పోలింగ్ నమోదయ్యింది.

### పోలింగ్ సరళి పరిశీలన

శ్రీకాకుళం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలు ముగిశాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, తదితర పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించారు. ఓటర్లతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని 31 పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య సజావుగా, ప్రశాంతయుతంగా, పారదర్శకంగా ముగిసిందని ఎస్పీ తెలిపారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం అయినప్పటి నుంచి తుది పోలింగ్ ముగేసేంతవరకు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించామన్నారు. పోలింగ్‌ముగిసిన అనంతరం ఎన్నికల సామాగ్రి, బ్యాలట్ బాక్సులను సురక్షితంగా విశాఖపట్నం లోని ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచేందుకు పట్టిష్టమైన జిల్లా ఆర్మ్ రిజర్వ్ పోలీసుల ఎస్కార్ట్ సహకారంతో తరలిస్తున్నామన్నారు. ఉత్తరాంధ్రలోని విజయనగరం, విశాఖపట్టణం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 123 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. పోటీలో పది మంది ఉన్నారని, 22,493 మంది ఓటర్లు ఉన్నారని గుర్తు చేశారు. మార్చి 3వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుందని చెప్పారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.








# జలం.. జగడం

* చక్రతీర్థ స్నానాలకు దిగువకు వంశధార నీరు * గొట్టాబ్యారేజ్ వద్ద రైతులు బైఠాయింపు * గేట్లు మూసేయాలంటు అన్నదాతలు ఆందోళన * బ్యారేజీ వద్ద వాహనాలు అడ్డంగా పెట్టి ధర్నా * వంశధార అధికారుల వైఖరిపై ఆయకట్టు రైతులు మండిపాటు * ఆయకట్టుపై ఆధారపడి సాగుచేసిన పంటలు పాడైపోతాయంటున్న రైతులు * వంశధార అధికారులు నచ్చజెప్పడంతో నిరసన విరమణ





4లో



నేడు శ్రీముఖలింగంలో
## చక్రతీర్థ స్నానాలు

4లో

## ఆదిత్యుని అన్నదానానికి రూ.లక్ష విరాళం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 27(వార్త):** కళింగపట్నం, వాడపల్లి గ్రామ వాస్తవ్యులు పప్పు గోవిందరావు, జ్యోతి తమ కుమార్తె లేట్ సుశీల జ్ఞాపకార్థం ..ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి శాశ్వత అన్నదానం పథకం నిమిత్తం రూ. 1,00,000లు గురువారం ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజుకు అందజేశారు. వారికి అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి జ్ఞాపికను అందజేశారు.



# రేపటి నుంచి పలాసలో ప్లాస్టిక్ అమ్మకాలు నిషేధం

**-మున్సిపల్ సిబ్బంది కలిసి కట్టుగా కృషి చేయాలి**

**-బిన్ ఫ్రీ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుదాము**

**-పలాస మున్సిపల్ కమీషనర్ ఎన్ రామరావు**



**పలాస, ఫిబ్రవరి 27(వార్త):** పలాస మున్సిపాలిటీలో నిషేధించబడిన ప్లాస్టిక్ అమ్మకాలను మార్చి ఫస్ట్ నుంచి నిలిపి వేసేందుకు వీలుగా అధికారులందరూ సిద్ధంగా ఉండాలని, నిషేధించబడిన ప్లాస్టిక్ వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, అందువల్ల అలాంటి ప్లాస్టిక్ పలాస మున్సిపాలిటీలో అమ్మకాలు జరగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు ఆయన మాట్లాడుతూ బకాయిలు ఉన్న ట్రేడ్ లైసెన్సులు ఈ నెలాఖరులోగా అంటే రేపటిలోగా వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే ఎం.ఎస్.ఎమ్. యు సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే బిల్ ఫ్రీ మున్సిపాలిటీగా తయారు చేయడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాల్సిందిగా ఆదేశించారు. అంతేకాకుండా పశువులు విచ్చల విడిగా రోడ్లపై విడిచిపెట్టడాన్ని అరికట్టాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ప్రజలకు మెరుగైన శానిటేషన్ను కల్పించడం గాను ఖాళీ స్థలాలు వద్ద గోడల పైన అందమైన పెయింటింగులు వేయంచాల్సిందిగా తెలియజేశారు. ముఖ్యంగా ఖాళీ ప్రదేశాల్లో జంగల్ క్లియరెన్స్ ను శానిటరీ సిబ్బంది తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కొత్తగా చేపడుతున్న వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేనెంబర్ సమర్థవంతంగా నిర్వహించాల్సిందిగా తెలియజేశారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు ఉదయపాత్రో, వెంకటేష్, కార్యదర్శులు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# కళలతో సామాజిక చైతన్యం



**పలాస, ఫిబ్రవరి 27(వార్త):** కాశీబుగ్గ హైస్కూల్‌లో స్థానిక జన జాగృతి సాహితి సమాఖ్య సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26రాత్రి నిర్వహించిన నవ వసంత వేడుకల భాగంగా శివరాత్రి పురస్కరించుకొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగస్థల, టీవీ, సినీ నటుడు కుమార్ నాయక్ మాట్లాడుతూ, కళల ద్వారా సమాజాన్ని జాగృతం చేయవచ్చని, కళాకారులు సామాజిక చైతన్యాన్ని వ్యాప్తి చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. కళాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి ఏటా జనజాగృతి సంస్థ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో ఎందరో ప్రతిభావంతుల్ని ప్రోత్సహించామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు రామినాయుడు మాట్లాడుతూ, కళాకారులు సామాజిక ఉన్నతికి పాటుపడాలని సూచించారు. ఈ వేడుకలో శ్రీనివాస్, చిద్విలాస శాస్త్రియ నృత్యం, కుజిత కూచిపూడి, ఈశ్వర్ పాత్రో మాట్లాడే బొమ్మ కార్యక్రమం, మిమిక్రీ, అంధ కళాకారుల పాటలు, జానపద గీతాలు ఆద్యంతం ప్రేక్షకులను అలరించాయి. చిన్నారుల శివతాండవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాకారుడు రిజెటి బోసుబాబుకు జనజాగృతి సభ్యులు సన్మానం చేపట్టారు.

కార్యక్రమానికి శ్రీనివాస్ బాబ్జి వ్యాఖ్యాతగా వ్యవహరించగా, జనజాగృతి వ్యవస్థాపకులు తెప్పల కృష్ణమూర్తి, కార్యదర్శి కాళిదాసు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి దీటుగా స్వచ్ఛంద సంస్థల సేవలు



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 27(వార్త):** ప్రభుత్వాలతో సమాంతరంగా సామాజిక సేవలు అందించే సామర్థ్యం ఒక్క స్వచ్ఛంద సంస్థలకు మాత్రమే ఉన్నాయని.. అనేక దేశాల్లో ప్రభుత్వాలకు సమాంతరంగా సేవలు అందించే ఘనత ఎన్ జీ ఓ లదే నని శ్రీకాకుళం నగరానికి చెందిన స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రపంచ ఎన్ జీ ఓ ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ప్రగతిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర గూర్చి సీనియర్ జర్నలిస్ట్ .. రాష్ట్ర జర్నలిస్టుల ఫోరం కార్యదర్శి శాసపు జోగినాయుడు వివరించారు.. అనంతరం స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి. ఇందిరాప్రసాద్, బీవీ. రవిశంకర్, పీజీ గుప్తా లు మాట్లాడుతూ.. సమాజమే దేవాలయంగా బావించి.. ఆరోగ్య సమాజ నిర్మాణానికి బాటలు వేసే అవకాశం వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలకు దక్కుతాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వేతర సంస్థల కీలక కృషిని గుర్తించి.. సముచిత రీతిలో గౌరవించడానికి ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 27 న ప్రపంచ ఎన్ జీ ఓ ల దినోత్సవ వేడుకలు జరుపుకోవడం 2014 నుండి వస్తుందని అన్నారు.. పేదరిక నిర్మూలనకు.. అసమానతలు లేని సమాజ స్థాపనకు.. మానవ హక్కుల పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి మరువరానిదని వారు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ప్రగతిలో స్వచ్ఛంద సంస్థలు పాత్ర కీలకమని.. గిరిజన ప్రాంతాల సమగ్రాభివద్ధికి ఇతోధికంగా కృషి చేస్తున్న సంస్థల సేవలు ఈ సందర్భంగా గుర్తు చేశారు.. ఈ కార్యక్రమంలో స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మి.. స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గుడ్ల జగ్గారావు, గోర్ల వాసుదేవరావు, సోపేటి కొండలరావు, సుగంధం సంజీవరావు, ఎం.మల్లిబాబు, మెట్ట దనుంజయ బట్ల, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్చి రెండవ తేదీ ఆదివారం స్టార్ వాకర్స్ క్లబ్ మరియు స్టార్ వనితా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార ఉత్సవానికి అందరూ కలిసికట్టుగా తరలి రావాలని కోరారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రంలో మెడికల్ క్యాంపు

**వంగర, ఫిబ్రవరి 27(వార్త):** వంగర హైస్కూల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో హెల్త్ సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు. హెల్త్ సిబ్బంది అసిస్టెంట్ వెంకన్న, గంట తవిటమ్మ , ఎస్ విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

## బరంపురం రైలు టైమ్ మార్చండి



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 27(వార్త):** బరంపురం-విశాఖపట్నం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు టైం మార్చాలని డిఅర్‌యుసిసి సభ్యులు కట్టా సూర్య ప్రకాశ్ కోరారు. ఈ మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్ధ డివిజనల్ ప్రిన్సిపాల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ వై ఎన్ బాబు కి వినతిపత్రం అందజేశారు. ఉదయం 5 గంటలకు బరంపురంలో బయలుదేరే విధంగా మార్చాలని కోరారు. రత్తకన్న ఎల్ సి గేటు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని చీఫ్ అడ్మినిస్ట్రేషన్ కంట్రోల్ ఆఫీసర్ జి హెచ్ విక్టర్ జోషప్ ని కోరారు. విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను లింగంపల్లి వరకు పొడిగించాలనిసీనియర్ డి సి ఎం అనిల్ కుమార్ ని కోరారు. డివిజనల్ ఇంజినీర్ అభిషేక్ కుమార్ ని కలిసి పాతలేశ్వర ఆలయం కి వెళ్లే దారిలో అండర్ పాసేజ్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో దేవరపల్లి గోపాల రావు, ఉల్లి రాజు, పొన్న పువ్వుల జనార్దనరావు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సాక్షిగా సూపర్ సిక్స్ వాయిదా!

**పలాస, ఫిబ్రవరి 27(వార్త):** రాష్ట్ర ప్రగతిపై ఎన్డీఏ కూటమిరాసిచ్చిన సోత్కర్ష పాఠాన్ని గవర్నర్ వాస్తవాలను గ్రహించకుండా గుక్కతిప్పుకోకుండా చదివారని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి హరినాథ్ విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేదనేది చంద్రబాబు ప్రకటనలో స్పష్టమైందని హరినాథ్ తెలిపారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో పిడిఎఫ్ ఎమ్మెల్యేలు వివరణాత్మకంగా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఉద్యోగ వర్గాలకు ,విద్యార్థులకుఇచ్చిన హామీలు డీఎస్సీ ,జాబ్ క్యాలెండర్లు, ఓ పి ఎస్ అమలు నోచుకోలేదని సహేతుకంగా ప్రశ్నించారని హరినాథ్ అన్నారు. వారు అధికారంలోకి వచ్చి 9 నెలలైనా 2026 వరకు ప్రకటించిన పథకాలు అమలు చేయలేమని చేతులెత్తేసారన్నారు. 2026 జూన్ 12 నాటికి ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం చేస్తామని రాబోయేవిద్యా సంవత్సరం పాఠశాలల ప్రారంభించే నాటికి మెగాడీఎస్సీ ప్రకటిస్తామని ప్రకటించటం విడ్డూరంగా ఉందని హరినాథ్ ఎద్దేవా చేశారు. రైతులకు ఇస్తానన్న రైతు భరోసా ఇవ్వకుండా మిర్చి రైతులు, మామిడి రైతులు సంక్షోభంలో ఉండగా రైతులు సుభిక్షంగా ఉన్నారని, గవర్నర్ చెప్పటం వాస్తవాలను గ్రహించకపోవటమేనని హరినాథ్ ఆరోపించారు. చంద్రబాబుకు ఆదాయం పెంచుకోవడానికి పన్నులు విధించడంలో ఉన్న ఉత్సాహం ప్రజలకురాయితీలు కల్పించడంలో ఉండదని గతంలో కూడా రుణాల రద్దు విషయంలో వాయిదాల పర్వం కొనసాగించి పూర్తిగా చెల్లించనందనేప్రజలు ఇంటికి పంపారన్నారు. కేంద్రం ఇచ్చే రైతు భరోసా6,000 కు రాష్ట్ర ప్రభుత్వం 14,000 కలిపి 20,000 మూడు దఫాలుగా ఏ తేదీలోగా అందిస్తారో ప్రకటించాలని హరినాథ్ డిమాండ్ చేశారు. విజన్ 2047, "ఫోర్ పి"విధానాలు ఉగాది నుండి ప్రారంభించి రాష్ట్రాన్ని కార్పొరేట్లకు అభివృద్ధి జపంతోఅన్ని రంగాలను ప్రైవేటుపరం చేసి (అప్పగించి) ప్రజలపై భారాలను వేయటానికి విజన్ల సృష్టికర్త చంద్రబాబు ఉత్సాహబడుతున్నారని హరినాథ్ విమర్శించారు. స్వర్ణాంధ్ర..రుణాంధ్రగా" మారనుందన్నారు.

## నూతన వస్త్రాల వితరణ

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 27(వార్త):** నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు కొంచాడ.సోమేశ్వరరావు 86వ జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక శాంతా కల్యాణ అనురాగ నిలయంలో ఉన్న చిన్నారులకు, ఆనంద నిలయంలో ఉన్న వృద్ధులకు, సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, కొంక్యాన మురళీధర్, డా.రవి కుమార్, వనజ, హాస్పటల్ మేనేజర్ వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్ హాస్పటల్ సిబ్బంది, అనురాగ నిలయ నిర్వాహకులు లలిత, సాయి సుధాకర్ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# రెండు తులాల బంగారం అపహరణ

**పలాస, ఫిబ్రవరి 27(వార్త):** రెండు తులాల బంగారం నగలు, 6000 రూపాయలు గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు జయ రామచంద్రపురం చెందిన బద్రి భారతి వ/ఓ లోకనాథం, ఫిర్యాదు వచ్చినట్లు కాశీబుగ్గ సూర్యనారాయణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు ఉదయం జీడిపిక్కల పనికి వెళ్లిపోతూ ఇంటికి తాళము వేసి ఇంటి బయట ఉన్న కరెంట్ మీటర్ పై పెట్టిందని తెలిపారు. తిరిగి రాత్రి 7 గంటలకు ఇంటికి వచ్చి బీరువా లో డబ్బులు దాయడానికి బీరువా తెరవగా బీరువా లో దాచుకున్న రెండు తులాల బంగారు చైన్, 5800 రూపాయలు కనిపించలేదని చెప్పారు. బీరువాలో కనిపించకపోవడంతో ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

**గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు మంత్రి అచ్చెన్న ఆదేశం**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 27(వార్త):** జిల్లాలో వేసవి తీవ్రత ను దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షణ అధికారికి ఈ మేరకు చరవాణిలో మాట్లాడి జిల్లా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామాలను గుర్తించి అక్కడ ఉన్న రక్షిత మంచినీటి పథకాలను మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. ప్రధానంగా ఉద్దాన ప్రాంతానికి తాగునీరు అందిస్తున్న ప్రధాన రక్షిత మంచినీటి పథకం పనితీరును మంత్రివర్యులు అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లాలో ఇతర మండలాల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలు పనితీరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బోరు బావులు మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. తాగునీటి అవసరాలకు నిధుల కొరత లేదని ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## మాట నిలబెట్టుకున్నారు

**-కిడ్నీ హాస్పిటల్ కి రెండు డయాలసిస్ మిషన్లు అందించిన ఎమ్మెల్యే శిరీష**




**పలాస, ఫిబ్రవరి 27(వార్త):** కిడ్నీ హాస్పిటల్ కి రెండు డయాలసిస్ యూనిట్లు ఇస్తానని హామీ ఇచ్చిన మేరకు పలాస ఎమ్మెల్యే శిరీష మాట నిలబెట్టుకున్నారు. ఇటీవల పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పలాస కిడ్నీ హాస్పిటల్ కి రెండు డయాలిసిస్ యూనిట్ లు ఇస్తామన్న మాట ప్రకారం గురువారం గ్లో సంస్థ ఆధ్వర్యంలో పలాస నియోజక వర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి హాస్పటల్ కి అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరము ప్రజా ఆరోగ్య అవసరాల కోసం ఏదో ఒక వస్తువు డొనేట్ చేసే హాస్పిటల్ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. అలా జరిగిన నాడే సంఘంలో ప్రతి ఒక్కరికి ఒక గుర్తింపు ఉంటుందని అన్నారు. హాస్పిటల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## సంగాం జాతరలో మహా అన్నదానం



**వంగర, ఫిబ్రవరి 27(వార్త):** సంగాం శ్రీ సంగమేశ్వర స్వామి మహా శివరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ జాతరకు వేలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. తరలివచ్చిన వేలాది భక్తుల కోసం పలువురు దాతలు జాతర ప్రాంతంలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం నీలానగరం గ్రామ సర్పంచ్. వావిలపల్లి పురుషోత్తం నాయుడు ఈ సంవత్సరం కూడా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ అన్నసంతర్పణ కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరవెల్లి సురేష్ ముఖర్జీ పాల్గొని భక్తులకు అన్నదాన సేవా కార్యక్రమం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట సర్పంచ్ బందారు సత్యన్నారాయణ మూర్తి. శ్రీనివాసరావు, బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి చెందిన రంగబాబు, పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం వండవ సెంటర్లో ఉన్న శ్రీ శిరిడి సాయి బాబా ధ్యాన మందిర ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులకు మంచినీరు, మజ్జిగ, నిత్య మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో దాతలు, అన్న సంతర్పణ నిర్వాహకులు, పలువురు భక్తులు, పాల్గొన్నారు. భక్తులకు ఆలయ ఈఓ. శ్యామలరావు, చైర్మన్ బోను ఆనందరావు, ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతిరావు తదితరులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



# ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 27(వార్త):** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మున్సిపల్ బాలి కొన్నత పాఠశాల లో నిర్వహించిన పోలింగ్ కేంద్రంలో 94 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయులు, కూటమి నాయకులు వేరువేరుగా శిబిరాలు నిర్వహించారు.కూటమి నేతలు మండల, పట్టణ అధ్యక్షులు,కార్యదర్శులు, నాయుకులుదక్షత కామేశ్వరరావు, ఎన్.జాని, ఎస్ సహదేవ్, కె శంకర్, డి.శ్రీను,ఎల్ పద్మనాభం, ఆశి లీలా రాణి, కె.దిలీప్,ఆర్.జాని, కె.ధర్మరాజు, సుభాష్ రౌళో, నాగేశ్వరరావు, ఆర్. భాస్కర్, లండ నీలవేణి, డి. విష, నా యుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**పలాస, ఫిబ్రవరి 27(వార్త):** పలాస నియోజకవర్గంలో గురువారం జరిగిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని రిటర్నింగ్ అధికారి పలాస ఆర్డిఓ గ్రంధి వెంకటేష్ వెల్లడించారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన ఉదయం నుంచి ఓటర్లు క్యూలైన్లో నిలబడ్డారు. ఈ ఎన్నికల్లో పలాసనాను 286లో ఉండగా 273 ఓట్లు పోలైనయని, వజ్రపు కొత్తూరు మండలానికి సంబంధించి 78 ఓట్లు ఉండగా 76 ఓట్లు పోలైనాయని, మందస మండలం సంబంధించి 178 ఓట్లు ఉండగా 174 ఓట్లు పోలైనట్లు ఆయన తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిన తర్వాత బాక్సులు విశాఖపట్నం తరలించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాశీబుగ్గ డిఎస్ పీ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**పోటా పోటీగా శిబిరాలు**

కూటమి ప్రభుత్వం తరపున జనసేన, టిడిపి, బిజెపి మద్దతుగా రఘు వర్మ క, వైసీపీ మద్దతు బరిలో పోటీపడిన విజయ గౌరీ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కూటం తరపున రఘు వర్మకు ఆర్భాటంగా ప్రచారం చేయడంతో పలాస టిడిపి సమన్వయకర్త వెంకన్న చౌదరి, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, లోడగల కామేష్, జి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్ గుప్తా, ప్రచారం చేశారు.



**వంగరలో 93.44 శాతం పోలింగ్ నమోదు..**

**వంగర, ఫిబ్రవరి 27(వార్త):** వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 93.44% పోలింగ్ నమోదైనట్లు తాసిల్దార్ డి ధర్మరాజు తెలిపారు. మండలంలో 61 మంది ఓటర్లకు గాను 57 మంది ఓటు హక్కును వినియోగించారు. ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల ఏర్పాట్లపై రాజాం రూరల్ సిఐ సిహెచ్ ఉపేంద్ర, స్థానిక ఎస్సై షేక్ శంకర్ తదితరులు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే కూటమి అభ్యర్థి తరపున కూటమి నాయకులు లచ్చుబుక్క కృష్ణమూర్తి, పార్టీ అధ్యక్షులు పి మోహన్ రావు, పిఎసిఎస్ అధ్యక్షులు రవి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహభరితంగా..
# మహాకుంభమేళా ముగింపు ఉత్సవాలు

**- లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో**

**పూర్ణాహుతితో శివనామ స్మరణ**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 27(వార్త):** మహా కుంభమేళ ముగింపు ఉత్సవాలు గురువారంతో ముగిశాయని, బ్రహ్మశ్రీ భాస్కరబట్ల శ్రీ రామ శర్మ తెలిపారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జోన్ చైర్మన్ పొన్నాడ. రవి కుమార్, మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవి కుమార్ ఇతర సభ్యుల సహకారంతో గత వారం రోజులనుండి కుంభమేళా ముగింపు ఉత్సవాల పర్యవేక్షణలతో వైభవంగా జరిగాయన్నారు. ఈ రోజు మహా లింగోద్భవం ప్రత్యేక దర్శనం, తెల్లవారు ఝామున బ్రాహ్మీకాలార్చన, మహా పూర్ణాహుతి తో మహాశివుని దర్శనం కనువిందు చేసిందని, ఈ దైవ కార్యాన్ని ఆ పరమశివుడు దగ్గరుండి చేయించినట్లేనని తెలిపారు. లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యులు మాట్లాడుతూ నాగావళీ నదీ గర్భం, ఉమారుద్ర కోటీశ్వర ఘాట్ వేదికగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలను అనుసరించి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నాగావళి నదీ గర్భంలో విశేష కార్యక్రమాలు జరగటం ఆనందంగా ఉందని, బ్రహ్మ శ్రీ భాస్కరబట్ల శ్రీ రామ శర్మ గురువుగారు ఆధ్వర్యంలో బ్రాహ్మీకాలం నుండి సుప్రభాత సేవ, బ్రాహ్మీకాల అభిషేకము అర్చనలు, యోగా సాధకులచే యోగ నిరూపణ, సామూహిక అభిషేకములు, హవనములు, అర్చన, అభిషేకం జరిగాయని, ఆరాధుగుల లింగదర్శన ప్రత్యేక పూజలు అనంతరం 108 విగ్రహాలును నదీగర్భంలో నిమజ్జనం చేశామన్నారు. ఈ కార్యక్రమం అందరి సహకారంతో జరిగిందని, ఇందులో భాగమైన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలన్నారు. ఇంతటి మహోత్తర కార్యక్రమం మన జిల్లాలో, అది కూడా శ్రీకాకుళం పట్టణం లో జరగటం కుంభమేళాను దగ్గరుండి తిలకించే భాగ్యాన్ని కలిగించారని, భక్తులు నగర పరిసర ప్రాంతాలనుండి కాకుండా, ఇతరప్రాంత ప్రజలు కూడా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో ప్రముఖ వైద్యులు, రాజకీయనాయకులు, మున్సిపల్ సిబ్బంది, పోలీస్ శాఖ, జేసీఐ సన్ రైజర్స్,పట్టణ ప్రముఖులు, వ్యాపారస్తులు శ్రీకాకుళం మెయిన్, గ్రీన్ సిటీ, రోటరీ, వాకర్స్ , లయన్స్ క్లబ్ ఇతర స్వచ్ఛంద సంస్థల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు .



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## చక్రతీర్థ స్నానాలకు సర్వం సిద్ధం



**శ్రీకాకుళం/జలుమూరు, ఫిబ్రవరి 27 (వార్త):** శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ముఖలింగేశ్వర స్వామి సన్నిధిలో చక్రతీర్థ స్నానాలకు సర్వం సిద్ధం చేశారు. లక్షలాది మంది భక్తులు ఈ స్నానాలు చేయనుండడంతో వంశధార నీటిని గొట్టా బ్యారేజ్ వద్ద నుంచి విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అలాగే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పటిష్ట బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ మహేశ్వరరెడ్డి చెప్పారు. వంశధారనదిలో చక్రతీర్థస్నానాలు చేసే ప్రాంతాన్ని ఎస్పీ సందర్శించి అక్కడి ప్రాచుర్యాన్ని అడిగితెలుసుకుని పోలీసులకు తగిన సూచనలు చేశారు.

# జలం.. జగడం

* చక్రతీర్థ స్నానాలకు దిగువకు వంశధార నీరు
* గొట్టాబ్యారేజ్ వద్ద రైతులు బైఠాయింపు
* గేట్లు మూసేయాలంటు అన్నదాతలు ఆందోళన
* బ్యారేజీ వద్ద వాహనాలు అడ్డంగా పెట్టి ధర్నా
* వంశధార అధికారుల వైఖరిపై ఆయకట్టు రైతులు మండిపాటు
* ఆయకట్టుపై ఆధారపడి సాగుచేసిన పంటలు పాడైపోతాయంటున్న రైతులు
* వంశధార అధికారులు నచ్చజెప్పడంతో నిరసన విరమణ

**హిరమండలం/శ్రీకాకుళం, ఫిబ్రవరి 27 (వార్త):** వంశధార గొట్టాబ్యారేజీ వద్ద గురువారం రాత్రి అంబావల్లి నీటి సంఘం పరిధిలోని గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. భగీరథపురం, భగీరథపురం కాలనీ, పింద్రువాడ, నీలాదేవిపురం, అంబావల్లి, రెల్లివలస, ఎంఎల్‌పురం తదితర గ్రామాలకు చెందిన రైతులు బ్యారేజీ వద్దకు చేరుకుని పాతపట్నం, శ్రీముఖలింగం, హిరమండలం వెళ్లే ముఖ్య కూడలిలో రహదారికి అడ్డంగా ద్విచక్ర వాహనాలు నిలిపి నిరసన తెలిపారు. రాత్రి వేళ బ్యారేజి వద్ద గేట్లు ఎత్తివేసి దిగువకు నీరు విడిచిపెడుతున్నారని, ఎడమ కాలువ పరిధిలోని వందల ఎకరాల వరి, ఇతర పంటలు నీరుతడి చాలక ఎండిపోతున్నాయన్నారు. గురువారం సాయంత్రం మరోసారి గేట్లు ఎత్తివేయడంతో ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, సర్పంచి చిరంజీవి, నీటి సంఘం డైరెక్టర్లు, రైతులు రామరాజు, తిరుపతిరావు తదితరులు వంశధార నరసన్నపేట డివిజన్ ఈఈ ప్రదీప్, గొట్టాబ్యారేజీ సబ్‌డివిజన్ డీఈఈ గణేష్, ఏఈఈలతో ఫోన్‌లో మాట్లాడి తమ సమస్య తెలిపారు. అధికారులు మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు శుక్రవారం శ్రీముఖలింగం చక్రతీర్థ స్నానాలు ఉండటంతో ఒక గేటును 10 సెంటీమీటర్ల మేరకు ఎత్తివేసి నీరు విడుదల చేశామన్నారు. బ్యారేజీలో 0.6 టీఎంసీలు నీరు ఉందని, శుక్రవారం ఉదయం వరకు నీరు విడిచిపెడితే కేవలం 0.1 టీఎంసీ నీరు దిగువకు వెళ్తుందని, మిగతా 0.5 టీఎంసీల నీరు ఉంటుందని ఆందోళన విరమించి సహకరించాలని కోరారు. అధికారుల హామీతో రైతులు నిరసన విరమించారు.



### న్యాయం చేయకుంటే
# ఆత్మహత్య చేసుకుంటా

* బారువ పోలీసుస్టేషన్ ఎదుట మృతురాలి కుటుంబీకులు ఆందోళన
* పోలీసులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్థులు

**సోంపేట/శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 27 (వార్త):** కుమార్తె వలిశెట్టి తులసికి న్యాయం చేయకుంటే తాను ఆత్మహత్య చేసుకుంటానని తులసి తల్లి బోగమ్మ పోలీసుల ముందు కన్నీటిపర్యంతమైంది. కుమార్తె మృతికి కారకుడైన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ బారువకొత్తూరు గ్రామస్థులు గురువారం రాత్రి బారువ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. మూడు రోజుల కిందట ఆమె ఆత్మహత్యకు పాల్పడగా.. సహోద్యోగి మద్ది ప్రదీప్ వేధింపులే కారణమని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు నిరసన పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఎస్సై హరిబాబునాయుడు వారిగి సర్ది చెప్పినప్పటకీ శాంతించలేదు. సోంపేట సీఐ మంగరాజు హుటాహుటిన చేరుకుని వారితో మాట్లాడారు. ఆదివారంలోపు నిందితుడిని అరెస్టు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో గ్రామస్థులు శాంతించారు.

## చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



**పొందూరు/శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 27 (వార్త):** అతివేగంగా వెళున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కుడివైపునకు వెళ్లి రోడ్డుపక్కన చెట్టును బలంగా ఢీకొంది. ఆ సమయంలో ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమా దం తప్పింది. వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో ఈ ఘటన చోటుచేసుకుందని ప్రయాణికులు చెబుతున్నారు. పాలకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం పాలకొండ నుంచి చిలకపాలెం మీదుగా విశాఖపట్నం వెళుతుండగా పుల్లాజీపేట వద్ద చెట్టును ఢీకొంది. దీంతో ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతింది. ప్రయాణికులకు స్వల్పంగా గాయాలు తగిలాయి. తొమ్మిది మంది ప్రయాణీకులను ప్రథమ చికిత్స జరిపి వారి గమ్య స్థానాలకు పంపించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బావిలోపడి ఆత్మహత్య



ఖాజీపేట గ్రామానికి చెందిన పల్ల లక్ష్మణరావు(45) బుధవారం రాత్రి బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు దీన్ని గమనించి లక్ష్మణరావుని బావిలోనుంచి బయటకు తీశారు. బావిలో రాయికి తల తగలడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఈయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెయింటింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని సాకుతున్న లక్ష్మణరావు అప్పుల పాలుకావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## బాణాం యువకుడు అదృశ్యం



బాణాం గ్రామానికి చెందిన 19ఏళ్ల యువకుడు మక్కా రామ్‌ప్రసాద్ ఆదివారం వత్సవలస యాత్రకు వెళ్లి తప్పిపోయాడని తండ్రి రమణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వత్సవలస యాత్రకు కుటుంబ సభ్యులంతా కలిసి వెళ్లారు. యాత్రలో రామ్‌ప్రసాద్ కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. రెండురోజులైనా కనిపించకపోవడంతో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# మరణంలోనూ వీడని స్నేహబంధం

* రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి
* కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు





**శ్రీకాకుళం క్రైం/ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 27 (వార్త):** వారిద్దరూ స్నేహితులు.. ఓ మిత్రుడి పెళ్లికి హాజరై తిరిగివస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ అశువులు బాశారు. వివరాల్లోకి వెళితే.. కవిటి మండలం బెజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన తుపాకి రాజు (20), తొత్తిడిపుట్టుగ గ్రామానికి చెందిన పొడియా లక్ష్మణరావు (22)లు ఈ నెల 25న ఒడిశా రాష్ట్రం చికిటి పాత్రపురం సమీపంలోని ఓ గ్రామంలో స్నేహితుడి వివాహానికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి వస్తుండగా నువుగాం సమీపంలో గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని ఢీకొట్టారు. బైకు పెట్రోల్ ట్యాంక్ పేలిపోవడంతో నడుపుతున్న రాజు, వెనక కూర్చున్న లక్ష్మణరావు మృతి చెందారు. దీంతో వారి వారి గ్రామాల్లో విషాదం అలుముకుంది. వీరి మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

### మరో రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ఎచ్చెర్ల:** శ్రీకాకుళం నగరంలోని మధురానగర్‌లో నివాసముంటున్న గార మండలం శ్రీకూర్మం పంచాయతీ బుద్ధయ్యగారిపేటకు చెందిన కుందు సూరిబాబు(55), సావిత్రి దంపతులు మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం విజయనగరం జిల్లా రామతీర్థం వెళ్లారు. గురువారం తిరుగు పయనమయ్యారు. జాతీయ రహదారిపై చిలకపాలెం సమీపంలోకి వచ్చేసరికి హైదరాబాద్ నుంచి పశ్చిమబెంగాల్ వెళ్తున్న ఓ అంబులెన్స్ వెనక నుంచి వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టింది.


ప్రమాదంలో భార్యాభర్తలు




తీవ్రంగా గాయపడ్డారు. వీరిని శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సూరిబాబు మృతి చెందారు. ఎస్సై వి.సందీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వ్యక్తికి గాయాలు

**పొందూరు:** రాపాక కూడలికి సమీపంలో ఎరుకల



కాలనీవద్ద గురువారం సాయంత్రం జరిగిన రహదారి ప్రమాదంలో కొంచాడ గ్రామానికి చెందిన పల్ల రాముకు తీవ్రంగా గాయాలు తగిలాయి. సిరిపురం నుంచి పొందూరుకు ఇసుకు తరలిస్తున్న ట్రాక్టర్ ఎరుకల కాలనీవద్ద రహదారి దాటుతున్న రాముని ఢీకొంది. ట్రాక్టర్ చక్రం ఎడమకాలు మీదుగా వెళ్ళడంతో పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థి మృతిపై అనుమానాలు

**ఎచ్చెర్ల/శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి27 (వార్త):** ఎచ్చెర్ల మండలంలోని సంతసీతారాంపురం పంచాయతీ పరిధిలోని చిన్నరావుపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన అన్నెపు లోకేష్ (18) విజయనగరంలో డిగ్రీ చదువుతున్నాడు. ఉన్నట్టుండి లోకేష్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులకు గురువారం వచ్చిన ఫోన్ కాల్‌తో కుటుంబసభ్యులు షాక్‌కు గురయ్యారు. ఆత్మహత్య చేసుకున్న అవసరమే లేదని ఏదో జరిగిందంటు ఇంటి నుంచి ఆగమేఘాలతో ఘటన జరిగిన విజయనగరానికి చేరుకున్నారు. ఘటన స్థలంలో లభ్యమైన ఆధారాలు, కొందరు స్నేహితులు పొంతన లేని సమాధానం చెప్పడంతో లోకేష్‌ది హత్యా లేక ఆత్మహత్యా అనేది మిస్టరీగా మారింది. దీనిపై విజయనగం పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రుల రోదన, బంధు వులు, స్నేహితుల కన్నీళ్లతో చిన్నరావుపల్లి యావత్తు శోకసంద్రంలో మునిగిపోయింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు చిన్నరావుపల్లి గ్రామానికి చెందిన అన్నెపు గణేష్, అమ్మాజమ్మ దంపతులు కుమారుడు లోకేష్. మృతుడు తండ్రి గణేష్ తాపీమేస్త్రి కాగా అమ్మాజమ్మ కూలీ పనులు చేసుకుంటుంది. పెద్దకుమారుడు సంతోష్ కుమార్. రెండవ కుమారుడు లోకేష్. సంతోష్ డిగ్రీ పూర్తయి ఉపాధికోసం అన్వేషిస్తుండగా లోకేష్ బాగా చదువుతాడని విజయనగరంలో తీసుకెళ్లి జాయిన్ చేశారు. ఓ వైపు చదువుతునే మరో వైపు క్రీడారంగంలో, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకోగా ఈనెల 26వ తేదీన మధ్యాహ్నం 12 గంటల సమయంలో లోకేష్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులకు తోటి స్నేహి తులు ఫోన్ చేసి చెప్పారు. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబసభ్యులు చేరుకుని జరిగిన దారుణంపై ఆరా తీసిన స్పష్టత లేకపోవడంతో కుటుంబసభ్యులు ఇది ఆత్మహత్య కాదు.. హత్యగా భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లోకేష్ మృతి వెనుక మిస్టరీని విజయనగరం వన్ టౌన్ పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపడుతున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546